సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 16, నవంబర్, 2024

ఆరనీకుమా ఈ దీపం..



- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి
- జిల్లావ్యాప్తంగా కిక్కిరిసిన హరిహర క్షేత్రాలు

10, 11లో

తెల్లవారుజామునే లేచి తలంటు స్నానం చేసి మహిళలు ఆలయాలకు చేరుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. శివ కేశవులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. అభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు, హోమాలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలం తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. శివ, విష్ణునామస్మరణలతో జిల్లాలోని ఆలయాలు మార్మోగాయి. నదీ తీరాలు సందడిగా మారాయి.



భద్రాచలం టౌన్: గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కొత్తగూడెంటౌన్: శ్రీపాండురంగ భజనమందిరంలో భక్తుల పూజలు



పాల్వంచ రూరల్ : యానంబైల్ గ్రామంలో సీతారామాంజనేయ ఆలయంలో దీపాలంకరణ

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్తీక పౌర్ణమి రోజు కావడంతో నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా పంచామృతాభిషేకం, చండీ హోమం పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ ప్రాంగణంలోని యాగశాలకు శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజలు జరిపి చండీహోమం చివరన పూర్ణహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణవ్రత పూజలు చేశారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న 28 మంది భక్త దంపతులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను ఈఓ రజనీకుమారి, అర్చకులు అందజేశారు.

కూలి బిడ్డకు సర్కారు ఉద్యోగం



చిన్నబాబు

అశ్వారావుపేటరూరల్: ఓ నిరుపేద కూలి బిడ్డ ప్రభుత్వ కొలువు సాధించాడు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మక్కళ్ల రాములమ్మ కుమారుడు చిన్నబాబు తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పదో తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ సత్తుపల్లిలో చదివాడు. చిన్నతనం నుంచి తల్లి రాములమ్మ కూలి పనులకు వెళ్లి చదివించగా, ఆ తల్లి కష్టం వృథా కాకుండా కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

అన్ని ప్రాంతాలకూ బస్సు సౌకర్యం..

చుంచుపల్లి : అన్ని ప్రాంతాలకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం డిపో నుంచి హైదరాబాద్–మియాపూర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన రాజధాని ఏసీ బస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ ప్రయాణసేవలను అందించే పరిస్థితి లేదని, ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని బస్సులను రద్దు చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. గతంలో రద్దు చేసిన హైదరాబాద్ సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. కొత్తగూడెం బస్టాండ్ ఆధునికీకరణకు మంత్రులకు ప్రతిపాదనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునీత, కంట్రోలర్లు వై.నాగేశ్వరరావు, జాకబ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, కందుల భాస్కర్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా దస్రు, యూసుఫ్, జక్కుల రాములు, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్షన్ హాల్స్



కొత్తగూడెంలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఫంక్షన్ హాల్ నిర్మాణం

కార్తీక మాసం కావడంతో పెద్దలు అంగరంగ వైభవంగా పెళ్లిళ్లు జరిపిస్తున్నారు. ఈ సీజన్‌లో దాదాపు 22 రోజుల్లో శుభముహూర్తాలు ఉండగా, ఇప్పటికే వందలాది జంటలు ఒక్కటయ్యాయి. ఇక పెళ్లి సందడితో ఫంక్షన్‌హాళ్లు కలెక్షన్ హాల్స్‌గా మారిపోయాయి. వీటికి అనుబంధంగా ఫొటో, వీడియోగ్రఫీ, డెకరేషన్, పూల అమ్మకాలు, క్యాటరింగ్ సర్వీసుల ధరలు మండిపోతున్నాయి. బంధుమిత్రుల రాకపోకలతో రవాణా సాధనాలు కూడా కిటకిటలాడుతున్నాయి. ఫంక్షన్ హాల్ బుకింగ్ నుంచి హనీమూన్ కారు మాట్లాడే వరకు ప్రతీ చోట అంచనాకు మించి ఖర్చు.. ఫలితంగా పెళ్లి తంతు జరిపించిన పెద్దల జేబులకు మాత్రం చిల్లులు పడుతున్నాయి. అనేక చోట్ల కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

దోపిడీకి అడ్డాగా మారిన ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు

- అందుబాటులోకి రాని సర్కారు ఫంక్షన్, కమ్యూనిటీ హాళ్లు
- శుభముహూర్తాల వేళ బుకింగ్ చేసుకోక తప్పనిపరిస్థితి
- పెళ్లి తంతు నిర్వహించి అప్పుల పాలవుతున్న పెద్దలు
- కార్తీకంలో తప్పని ఇబ్బందులు మాఘంలోనైనా తప్పేనా ?

ట్రెండ్ మారింది

రెండు దశాబ్దాల కిందటి వరకు పెళ్లి తంతు నిర్వహించే ఇంటి ముందు కొత్త పందిరి వేసే వారు. రంగురంగు కాగితాలతో ఆ పందిరితోపాటు ఇంటిని అలంకరించేవారు. ముహూర్తానికి ముందు కొబ్బరి మట్టలతో అల్లిన పందరిలో పెళ్లి తంతు జరిగేది. ఈ వేడుకలకు హాజరయ్యేందుకు కనీసం రెండు మూడు రోజుల ముందు నుంచే దూరప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరయ్యేవారు. పెళ్లి పనుల్లో తలా ఓ చేయి వేసేవారు. ఆ పెళ్లింటనే ఇంత చోటు చూసుకుని విశ్రమించేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. గ్రామాల్లో సైతం ఇంటి దగ్గర పెళ్లి చేసే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. ఫంక్షన్ హాళ్లలోనే పెళ్లిలు జరిపిస్తున్నారు. బంధుమిత్రులు సైతం ముహూర్తం టైంకి వచ్చి అక్షింతలు వేసి, పెళ్లి విందు ఆరగించి వెళ్లిపోతున్నారు.

పిండేస్తున్నారు

పెళ్లిలకే కాదు బర్త్‌డేలకు సైతం ఫంక్షన్ హాల్స్ వేదికగా నిలుస్తుండటంతో రోజురోజుకూ గిరాకీ పెరిగిపోతోంది. ముఖ్యంగా శుభముహూర్తాల సీజన్ వచ్చిందంటే చాలు అదనపు రేట్లకు ఫంక్షన్‌హాళ్లు బుక్ చేసుకోవాల్సి వస్తోంది. కనీసం పార్కింగ్ సౌకర్యం లేని ఫంక్షన్ హాల్‌కు సైతం పన్నెండు గంటలకు రూ.30 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. గరిష్టంగా రూ.5 లక్షలు వసూలు చేసే ఫంక్షన్‌హాల్స్ సైతం జిల్లాలో ఉన్నాయి. కల్యాణ వేదికకు డబ్బులు చెల్లించడమే భారం అనుకుంటే అక్కడ తిష్ట వేసిన సిండికేట్‌తో ఈ భారం తడిసిమోపెడు అవుతోంది. ప్రతీ ఫంక్షన్‌హాల్‌కు అనుబంధంగా డెకరేటర్స్, క్యాటరర్స్, ఫొటోగ్రాఫర్స్, టెంట్‌సామన్లు, డీజే, బ్యాండ్‌బాజాలకు సంబంధించిన వ్యక్తులు ఉంటున్నారు. ఒకసారి హాలు బుక్ అయిన తర్వాత మిగిలిన సేవలు కావాలంటే ఈ సిండికేట్ వ్యక్తులు చెప్పిందే రేటు. కాదంటే అక్కడికి వేరేవారు రారు. హాలు యజమానులకు సిండికేట్‌లకు మధ్య ఉన్న కమిషన్ల వ్యవహారమే ఇందుకు కారణం. దీంతో వధూవరులకు నచ్చడం, జాతకాలు చూసుకోవడం, ముహూర్తం పెట్టుకుని బంధుమిత్రులను పిలవడం కంటే ఈ పెళ్లి తంతును జరిపించడమే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది.

పట్టింపేలేని సర్కారు

ఏడాదిపాటు ఎకరం పొలం సాగు చేయడం కంటే ఒక్క సీజన్‌లోనే అధిక లాభం వస్తుండటంతో పల్లెల్లో సైతం ప్రైవేటు సెక్టారులో ఫంక్షన్ హాళ్లు వస్తున్నాయి. మరోవైపు సర్కారు కూడా మారిన పరిస్థితులకు తగ్గట్టుగా ఐదారేళ్ల కిందటే శుభకార్యాల కోసం భారీ హాళ్లను నిర్మాణం మొదలెట్టినా అవి నేటికి అందుబాటులోకి రాలేదు. ఉదాహరణకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో టీటీడీ కల్యాణమండలం మూతపడి ఐదేళ్లు దాటింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాజీవ్‌పార్క్, హనుమాన్ బస్తీలో రూ.80 లక్షలతో నిర్మించిన ఎంపవర్ సెంటర్లు నిర్మాణాలు అసంపూర్తిగా ఉండి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఇల్లెందులో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ఆధునిక గిరిజన్ భవన్ ఐదేళ్లు దాటినా నేటికీ తలుపులు తెరుచుకోలేదు. ఈ భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని మంత్రి తుమ్మల సెప్టెంబరులో ఆదేశించినా సానుకూల ఫలితం రాలేదు. ఇక్కడే నిర్మిస్తున్న మల్టీ యుటిలిటీసెంటర్, అంబేద్కర్ భవన్, బంజరా భవన్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మణుగూరు, పాల్వంచ, అశ్వారావుపేట, సారపాకలలోనే ఇదే తరహా ఇబ్బందులు ఉన్నాయి. స్థలమే లేని భద్రాచలం పరిస్థితి మరీ దారుణం.

రైతు వేదికల్లో ఫంక్షన్లకు అవకాశం ఇస్తే..

గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రైతు వేదికలు అనేక చోట్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, సింగరేణి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. వచ్చే మాఘమాసం నాటికైనా వివిధ దశల్లో నిర్మాణంలో సర్కారు భవనాలను అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కమ్యూనిటీ సెంటర్లు, రైతు వేదికలకు అదనంగా స్టోర్‌రూమ్స్ ఏర్పాటు చేస్తే శుభకార్యాలకు విరివిగా ఉపయోగించుకునే వీలు ఉంటుంది. తద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలి



బిర్సా ముండా జయంతి వేడుకలకు హాజరైన కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, అధికారులు

- ఆదివాసీ యువత అభివృద్ధికి కంకణం కట్టుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలంఅర్బన్: పాతికేళ్లు మాత్రమే జీవించిన బిర్సా ముండా హక్కుల కోసం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి, ఆదివాసీల ఆరాధ్య దైవంగా మారాడని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ సమావేశం మందిరంలో బిర్సా ముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధర్తీ అభా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం గురించి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిర్సా చాయిబాసాలోని మిషనరీ స్కూల్లో చదువుకునేందుకు క్రైస్తవంలోకి మారాడని, చదువుకుంటూనే అడవి మీద ఆధారపడే ఆదివాసీల హక్కుల కోసం పోరాడాడని గుర్తుచేశారు. కుంతి, తామర్ భాషీయా, రాంచి ప్రాంతాలను సరిహద్దులుగా చేసుకుని మిలిటెంట్ ఉద్యమాన్ని నడిపాడని కొనియాడారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని నేటి ఆదివాసీ యువత అభివృద్ధికి కంకణం కట్టాలని, సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని చెప్పారు. గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటి జిల్లాకు ఓవరల్ చాంపియన్‌షిప్‌లు సాధించడం అభినందనీయమని అన్నారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు సందర్శించేలా బెండాలపాడు, తుమ్మలచెరువు, దామరతోగు, అటుకులపాడు గ్రామాలను పర్యాటక దర్శనీయ స్థలాలుగా గుర్తించామని చెప్పారు. ఆదివాసీ గ్రామాల్లో బస చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ట్రైకార్ జీఎం శంకర్‌రావు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఐటీడీఏ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆదివాసీ అభివృద్ధికి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించుకోవాలన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేయలేని అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరంలోనే చేసిందని పేర్కొన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడిన ఆదివాసీ ముద్దు బిడ్డ బిర్సా ముండా అని అన్నారు. సమసమాజం కోసం, ఆర్థిక జీవన ప్రమాణాల పెరుగుదల కోసం పాటుపడాడ్డని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, బిర్సా ముండా వంటి మహనీయులు పోరాటం ఫలితంగా 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ భూములలో పోడు తదితర అవకాశాలు కలిగాయన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ఆదివాసీ నృత్యాలతో అలరించారు. ఓ విద్యార్థి కలెక్టర్ బొమ్మను గీసి, ఆయనకు బహూకరించారు.

వైటీసీలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని వైటీసీని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్టి ఇటుకల తయారీని విధానాన్ని ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ ఇటుకలతో తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని, పర్యావరణానికి సైతం కూడా మేలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రమ్మిడి ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు శిక్షణ ఇప్పించామని చెప్పారు. ఈమేరకు ఎమ్మెల్యేలు స్పందిస్తూ ఈ ఇటుకలతో ఒక ఇంటిని నిర్మిస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవలంబించేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, ఐటీడీఏ అధికారులు డేవిడ్ రాజ్, మణెమ్మ, తానాజీ, రాంబాబు, రమణయ్య, అలివేలు మంగ తాయారు, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ సంజీవ రావు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో న్యాయవాదుల జలవిహారం



కిన్నెరసానిలో బోటు షికారు చేస్తున్న న్యాయవాదులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని శుక్రవారం ప్రభుత్వ(అటవీశాఖ) హైకోర్టు న్యాయవాది ఈ.పూర్ణచందర్‌రావు, సిటీ సివిల్ కోర్టు ఏజీపీ ఎస్.వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, పర్యావరణ కేంద్రాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. వైల్డ్‌లైఫ్ రేంజర్ కవిత మాధురి, ఎఫ్ఎస్ఓ కిషన్, ఎఫ్‌బీఓ రాములు ఉన్నారు.

19న బహిరంగ విచారణ

కొత్తగూడెంరూరల్: బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌పై ఖమ్మం కలెక్టరేట్‌లో ఈ నెల 19న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని శాసనసభ సభ్యులు, శాసన మండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, బీసీ సంచార జాతుల కుల పెద్దలు, బీసీ సంఘాల నాయకులు విచారణకు హాజరై తమ అఫిడవిట్లను 6 సెట్లలో తెలుగు లేదా ఆంగ్లంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ టోర్నీ ప్రారంభం

- ఖమ్మంలో అండర్–14 బాలబాలికల పోటీలు
- ఉమ్మడి పది జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఈఓ శర్మ, డీవైఎస్ఓ సునీల్‌కుమార్ తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ –14 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ఖమ్మంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలను ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు పాత పది జిల్లాల నుంచి 320 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఖమ్మం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కీడల్లోనూ రాణించాలని, తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా క్రీడాకారులు ఉండడం.. నేటి తరం కూడా క్రీడలపై ఆసక్తి చూపుతుండడం మంచి పరిణామమని తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ ఏటా ఖమ్మం జిల్లాలో అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తుండగా మంచి స్పందన వస్తోందని చెప్పారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు డి.ప్రసాద్, నున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, ఎండీ.షఫీక్ అహ్మద్, కోచ్ ఎండీ.గౌస్‌తో పాటు పి.రవిమారుత్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ టోర్నీలో తొలిరోజు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర 600 మీటర్ల పరుగు పందెంలో కె.జకేష్(ఆదిలాబాద్), కె.లోకేష్(వరంగల్), ఎం.చరణ్(వరంగల్), బాలికల విభాగంలో ఎం.రాజేశ్వరి(వరంగల్), ఎం.డీ.సమీరా(కరీంనగర్), టి.పల్లవి(రంగారెడ్డి), లాంగ్‌జంప్‌లో అన్విత(రంగారెడ్డి), శృతిహాసన్(ఖమ్మం), ధన్యశ్రీ(హైదరాబాద్), బాలుర షాట్‌పుట్‌లో జె.సాత్విక్(ఆదిలాబాద్), బి.నరేష్(ఖమ్మం), వంశీ(మహబూబ్‌నగర్) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని నివారించాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని నివారించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కేఎస్ ప్రదీప్, కార్యదర్శి వాంక్‌డోత్ అజయ్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఆస్పత్రుల దోపిడీ కారణంగా ఏటా 4 శాతం మంది పేదలుగా మారుతున్నారని, జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ సర్వేలో ఈ విషయం వెల్లడైందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందకపోవటంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్న ఫీజులపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.

ముగిసిన సింగరేణి కల్చరల్ మీట్



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీవోఏ క్లబ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న కంపెనీ లెవల్ కల్చరల్ మీట్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం శాలేంరాజు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలు, కోలిండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీట్‌లో పాల్గొన్న కళాకారులను ఆదర్శంగా తీసుకోవాలని మిగతా కార్మికులు కళల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వేదిక ఏర్పాటు చేయాలని కళాకారులు కోరగా, ఖాళీగా ఉన్న క్వార్టర్‌ను కేటాయిస్తామని జీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటిరెడ్డి, బి.శివకేశవరావు, ఎస్.యోహాన్, నాయకులు రజాక్, గట్టయ్య, ఉపేందర్‌బాబు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

13 కిలోల వెండి కవచాలు బహూకరణ


వెండి కవచాలంకరణలో స్వామివారు

భద్రాచలంటౌన్: భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన తల్లపనేని భవానీదేవి, ఆమె కుమారులు శ్రీధర్, శ్రీకాంత్ రూ.18లక్షల విలువైన 13 కిలోల వెండితో చేయించిన కవచాలను బహూకరించారు. ఈ మేరకు శుక్రవారం కవచాలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేయగా వాటిని స్వామికి అలంకరించారు.

వృద్ధురాలికి చేయూత


వీల్‌చైర్, ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మణుగూరుటౌన్: 'చెట్టు కిందే వృద్ధురాలి జీవనం' అనే శీర్షికతో ఓ వృద్ధురాలి దీన గాథ శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితంకాగా స్వచ్ఛంద సంస్థ చేయూత నందించింది. రెండు నెలలుగా చెట్టునే ఆశ్రయంగా మార్చుకుని నడవలేని వృద్ధురాలికి మణుగూరు మండలానికి చెందిన ఎం.జె మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. వృద్ధురాలి వివరాలు సేకరించిన ట్రస్ట్ ప్రతినిధులు వీల్‌చైర్ కొని ఇవ్వడంతో పాటు వైద్యానికి ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ షబనమ్, డాక్టర్ ఫిరోజ్, అనిల్‌కుమార్, భోగినేని వరలక్ష్మి నజీమా, మమత, జ్యోతి, దివ్య, సత్య సభ్యులు పాల్గొన్నారు.

మావోయిస్టుల స్మారక స్తూపాల కూల్చివేత


కొండపల్లిలోని మావోయిస్టుల స్మారక స్తూపాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

చర్ల: సరిహద్దున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాలోని కొండపల్లి, తుమ్మలపాడు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేసిన పోలీసు ఉన్నతాధికారులు ఆయా గ్రామాల్లోని మావోయిస్టుల స్మారక స్తూపాలను కూల్చివేస్తున్నారు. కొండపల్లిలో సుమారు 20 అడుగుల ఎత్తు గల మూడు స్మారక స్తూపాలను శుక్రవారం పోలీసులు జేసీబీలతో కూల్చివేయగా, తుమ్మలపాడు సమీపంలో ఉన్న స్తూపాలను కూడా కూల్చివేశారు. క్యాంపుల ఏర్పాటుకు సంబంధించిన పనులను కొనసాగిస్తూనే మరోపక్క సమీప అటవీ ప్రాంతాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్లను కొనసాగిస్తున్న సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు ఆయా గ్రామాల్లో ఉన్న మావోయిస్టుల స్మారక స్తూపాలను కూల్చివేస్తున్నారు.

ప్రమాదవశాత్తు డోజర్ దగ్ధం


దగ్ధమైన డోజర్

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామపంచాయతీ ధర్మారంతండా గ్రామ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు డోజర్ దగ్ధమైంది. యజమాని లాకావత్ రాంబాబు సమీప బంధువు పొలం దున్నుతున్న క్రమంలో డోజర్ ఇంజన్ భాగం నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో భయాందోళనకు గురైన రాంబాబు కిందకు దిగి దూరంగా వెళ్లాడు. కొద్దిసేపట్లోనే డోజర్ పూర్తిగా దగ్ధమైంది. మంటలు ఆర్పేందుకు దగ్గరలో ఎవరూ లేకపోవడంతో డోజర్ కాలిపోతున్నా రాంబాబు నిస్సహాయుడిగా ఉండిపోయాడు. రాంబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

కార్తీక వెలుగులు..


కొత్తగూడెంటౌన్: భక్తులతో నిండిపోయిన భజన మందిరం


కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని పాండురంగ భజన మందిరంలో దీపం వెలిగిస్తున్న యువతి



కొత్తగూడెంటౌన్: గణేశ్ టెంపుల్లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


భద్రాచలంటౌన్: గోదావరి తీరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


భద్రాచలంటౌన్: గోదావరిలో దీపాలను వదులుతున్న మహిళా భక్తులు


భద్రాచలంటౌన్: పుణ్య స్నానమాచరించి మొక్కుతున్న మహిళ

- తెల్లవారుజాము నుంచే కిటకిటలాడిన ఆలయాలు
- శివుడు, విష్ణువుకు భక్తిశ్రద్ధలతో దీపారాధన..
- శివుడికి అభిషేకాలు, కుంకుమార్చనలు

కొత్తగూడెంటౌన్/భద్రాచలంటౌన్: కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి ప్రత్యేక స్థానం ఉంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని.. దీపాలు వెలిగించారు. సూర్యోదయం కంటే ముందుగానే స్నానాలు ఆచరించి.. దేవాలయాలకు చేరుకుని, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. మూడు వందల అరవై ఐదు ఒత్తులు వెలిగించి.. మహిళలు భక్తిని చాటుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలు, వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి మొదలుకుని రాత్రి వరకు కూడా సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని చంద్రమౌళీశ్వరస్వామి, రైటర్‌బస్తీలోని శ్రీమాతాశక్తి పంచాయతనా క్షేత్రం, గణేశ్ టెంపుల్, పాండురంగ భజన మందిరం, బూడిదగడ్డబస్తీలోని శివపంచాయతనా క్షేత్రం, రామవరంలోని శ్రీహనుమాశ్శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇక.. భద్రాచలంలోని గోదావరి తీరం భక్తులతో నిండిపోయింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. వేకువజాము నుంచి స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో గోదావరి తీరం సందోహంగా మారింది. కార్తీకమాసంలో శుక్రవారం పౌర్ణమి రావడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో గోదావరికి పూజలు నిర్వహించి, దీపాలను వెలిగించారు. అరటి డొప్పల్లో వెలిగించిన దీపాలను నదిలో వదిలారు. మట్టితో అమ్మవారి బొమ్మలను తయారుచేసి ఉసిరి చెట్టును నాటి దీపాలు వెలిగించారు. అనంతరం నదీ తీరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామివారి ఆలయాలతో పాటు రామాలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో రామయ్య దర్శనానికి బారులుదీరాల్సి వచ్చింది. ఉదయం రామాలయ పరిసరాలతో పాటు కరకట్టపైకి వాహనాలు భారీగా వచ్చాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.


భద్రాచలంటౌన్: కరకట్ట కింద రోడ్డులో ట్రాఫిక్ జామ్

వైకుంఠధామంలో ధాన్యం రాశులు


వైకుంఠధామం వద్ద ధాన్యం ఆరబోస్తున్న రైతు

పాల్వంచరూరల్: ధాన్యం ఆరబోసేందుకు కొనుగోలు కేంద్రం వద్ద స్థలం ఏక రైతులు వైకుంఠాధామంలో ఆరబోశారు. మండలంలోని సోములగూడెం శివారులో వైకుంఠధామం సమీపంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడికి సోములగూడెం, సూరారం, బిక్కుతండా, కమ్మరిగూడెం, జగన్నాథపురం గ్రామాలకు చెందిన రైతులు రెండు, మూడు రోజులుగా ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ధాన్యం అధికంగా రావడంతో స్థలం సరిపోక కొందరు వైకుంఠధామంలో ఆరబోశారు. కాగా, ఈ సమయంలో గ్రామంలో ఎవరైనా కాలం చేస్తే వైకుంఠధామంలోకి తీసుకురావడం కూడా కష్టంగానే ఉంటుందని రైతులు అంటున్నారు. కాగా, కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు.

వెదురు సాగుకు రైతులను ప్రోత్సహించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బూర్గంపాడు: వెదురు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. బూర్గంపాడు మండలంలోని సందెళ్ల రామాపురం అటవీశాఖ నర్సరీని శుక్రవారం పరిశీలించిన ఆయన రైతులకు సరఫరా చేసేలా వెదురు మొక్కలను విరివిగా పెంచాలని అధికారులను ఆదేశించారు. రైతులు పొలం గట్లు, చెరువు కట్టలతో పాటు కోతకు గురయ్యే భూములలో వెదురు సాగు చేసుకోవచ్చని, తద్వారా పెట్టుబడి లేకుండా ఆదాయం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, నర్సరీ ఇన్‌చార్జ్ భీంచంద్ నాయక్, బీట్ ఆఫీసర్ ఉపేందర్ పాల్గొన్నారు.


బూర్గంపాడు : సందెళ్ల రామాపురం అటవీ నర్సరీలో పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

భద్రాచలంలో పర్యటన

భద్రాచలంఅర్బన్/భద్రాచలం టౌన్: భద్రాచలంలోని గోదావరి ఘాట్‌ను కలెక్టర్ జితేష్.వి.పాటిల్ శుక్రవారం పరిశీలించారు. నదీస్నానానికి వచ్చిన భక్తులకు ప్రమాదాల బారిన పడుతున్నందున ఐరన్ మెస్ ఏర్పాటు, తదితర అంశాలపై సూచనలు చేశారు. అలాగే, మత్స్యకారులకు నిత్యం ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆదివాసీలతో పుట్టీలు చేయిస్తే అటు మత్స్యకారులకు, ఇటు ఆదివాసీలకు ఆర్థికాభివృద్ధితో పాటు పర్యాటకుల షికారుకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ విద్యాచందన, భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు మధుసూదన్, వెంకటేష్, ఆర్‌ఐ నర్సింహారావు పాల్గొన్నారు. ఆతర్వాత కలెక్టర్ పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఇంటింటి సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు.


భద్రాచలం టౌన్ : ఇంటింటి సర్వేను పరిశీలిస్తూ..

నేటి బాలలే రేపటి పౌరులు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సూపర్‌బజార్ (కొత్తగూడెం): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్ అన్నారు. జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలకు రెండో రోజు శుక్రవారం ఆయన హాజరై ప్రసంగించారు. చదువు జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తిని వెలికి తీసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కాగా, విద్యార్థులకు చిత్రలేఖనం, పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.మణిమృదుల, శాఖ గ్రంథాలయ అధికారి మధుబాబు, నాగన్న, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో గురుకుల విద్యార్థుల సత్తా


బహుమతి అందుకుంటున్న ఫుట్‌బాల్ విజేతలు

పాల్వంచరూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగిన భద్రాద్రి జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలుర) విద్యార్థులు సత్తా చాటారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, పాఠశాలకు చెందిన 85 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని, 6 బంగారు, 8 రజత, 6 కాంస్య పతకాలు సాధించారని పీడీ కంచ మహేశ్ తెలిపారు. షాట్‌పుట్‌లో ఎ.రాము బంగారు పతకం కై వసం చేసుకోగా, హైజంప్‌లో డి.లోకేశ్, లాంగ్‌జంప్‌లో శ్రీకాంత్, 5కే రన్‌లో దిలీప్, 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాలు సాధించారు. ఫుట్‌బాల్ అండర్–17, అండర్–19 విభాగంలో ప్రథమస్థానం, చదరంగం అండర్–17లో ప్రథమ, అండర్–19లో ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ పాపారావు అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఇల్లెందు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని మసివాగుతండాకు చెందిన మౌనికకు బొంబాయితండాకు చెందిన అశోక్‌తో ఏడాది కిందట వివాహమైంది. కాగా, కొంతకాలంగా తనను అదనపు కోసం వేధిస్తున్నారని మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారించిన ఎస్‌ఐ బి.సూర్య కేసు నమోదు చేశారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పాల్వంచరూరల్: కిరాణా దుకాణంలో విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను శుక్రవారం పోలీసు లు పట్టుకున్నారు. మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని కిరాణా దుకాణంలో ఎస్‌ఐ సురేశ్ తనిఖీలు చేపట్టగా రూ.6,635 విలువ గల గుట్కా ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, వ్యాపారి వి.శంకర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అలరించిన జాతీయస్థాయి బాలోత్సవ్


జానపద గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మధిర: రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన మధిరలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో 27వ జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలను మధిర రంగస్థలం కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రారంభించారు. తొలిరోజు శాస్త్రీయ, జానపద నృత్యాలతోపాటు బృంద నృత్యాల పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. రామభక్త సీతయ్య కళాపరిషత్ అధ్యక్షుడు బాబ్లా మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను పరిరక్షించేందుకు కళాకారులకు పుట్టినిల్లయిన మధిరలో పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కళల ద్వారా ప్రజలను చైతన్యపరిచి సమాజంలో రుగ్మతలను నిర్మూలించవచ్చునని చెప్పారు. కాగా, వివిధ ప్రాంతాల విద్యార్థులు సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వాగ్వాదానికి దిగాడనే కోపంతోనే...

లారీతో ఢీకొట్టి వ్యక్తి మృతికి కారకులైన ఇద్దరి అరెస్ట్

మధిర: బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమాన లారీ తనకు తాకిందని వాగ్వాదానికి దిగిన వ్యక్తి పలుమార్లు వాహనాన్ని ఆపడం.. ఆపై లారీకి అడ్డుగా నిలబడ్డాడనే కోపంతో ఢీకొట్టగా మృత్యువాత పడ్డాడు. ఈనెల 12న రాత్రి జరిగిన ఈ ఘటనకు కారకులైన లారీ డ్రైవర్, క్లీనర్‌ను అరెస్ట్ చేసినట్లు మధిర సీఐ డి.మధు వెల్లడించారు. ఈమేరకు మధిర సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ముత్యాలంపాడుకు చెందిన లారీ డ్రైవర్ రామిశెట్టి దుర్గారావు, నందిగామకు చెందిన క్లీనర్ పింగలి మల్లారెడ్డి ఈనెల 11న నాగపూర్ నుంచి కందిపప్పు లోడ్‌తో బయలుదేరారు. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం మీదుగా ఈనెల 12న రాత్రి 7గంటల సమయాన వైరా చేరుకున్నారు. అక్కడ నుంచి మధిర మీదుగా కంచికచర్ల నుంచి విజయవాడ వెళ్లాల్సి ఉంది. అయితే, వైరా దాటాక లారీ ముందు బైక్‌పై వెళ్తున్న కొలికపోగు సోమయ్య(40)ను ఓవర్ టేక్ చేశారు. ఈక్రమాన లారీ తన బైక్‌కు తాకిందని, తనను ఢీకొట్టేందుకు అలా చేశారని భావించిన సోమయ్య లారీని వెంబడిస్తూ పాలడుగు క్రాస్ వద్ద అడ్డుకున్నారు. దీంతో లారీ డ్రైవర్ – సోమయ్య నడుమ వాగ్వాదం జరి గింది. ఆపై డ్రైవర్ మధిర వైపు వస్తుండగా మళ్లీ సోమయ్య వెంబడిస్తూ కృష్ణాపురం వద్ద ఆపాడు. అక్కడ డ్రైవర్, క్లీనర్‌తో వాగ్వాదానికి దిగడమే కాక లారీకి అడ్డుగా నిలబడ్డాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో లారీతో ఆయనను ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో నిధానపురం క్రాస్ వద్ద లారీని ఆపేసి డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. ఈ ఘటనపై ప్రత్యక్షసాక్షుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో మధిర రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

దుకాణంలో సామగ్రి చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మసీద్ సెంటర్‌లో పైపులు విక్రయించే దుకాణంలో పనిచేసే గుమస్తా అదే దుకాణంలోని సామగ్రి చోరీ చేశాడు. అనంతరం ఆ సామగ్రిని ఎదురుగా ఉన్న మరో దుకాణం యజమానికి విడతల వారీగా విక్రయించాడు. చాలారోజుల కిందట ఈ ఘటన జరగగా శుక్రవారం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. అయితే, కొన్ని రోజుల తరువాత గుమస్తా పని చేస్తున్న దుకాణం యజమానికి అనుమానం వచ్చి తన దుకాణంలో ఉన్న సామగ్రిని పరిశీలించగా ఉండాల్సిన సామగ్రి కంటే తక్కువ ఉంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఇప్పటికే పోలీసులు కొంత సామగ్రిని రికవరీ చేయగా.. మరి కొంత చేయాల్సి ఉంది. చోరీకి గురైన సామగ్రి రూ.6 లక్షల వరకు ఉంటుంది.

ఈ ఘటన జరిగి చాలా రోజులు అవుతున్నప్పటికీ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రెండు దుకాణాల గుమస్తాలతో పాటు సామగ్రి కొనుగోలు చేసిన దుకాణ యజమానిపై కూడా కేసు నమోదైనట్లు టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


వెంకన్నబాబు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వారావుపేట మండలానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మర్లపాటి వెంకన్నబాబు(20) ఏడాది కిందట గుంటూరులో ఓ ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. గురువారం రాత్రి స్వగ్రామంలో జరిగిన అయ్యప్ప పడిపూజకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తున్న క్రమంలో విజయవాడ – గుంటూరు మధ్యలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు, చెల్లి ఉంది. కాగా, యువకుడి మృతితో స్వగ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


చందు (ఫైల్)

టేకులపల్లి: అనారోగ్యం వేధిస్తుండటంతో జీవితంపై విరక్తి చెందిన ఓ దివ్యాంగుడు కలుపుమందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టేకులపల్లి డబుల్‌బెడ్ రూం కాలనీలో నివాసం ఉంటున్న దివ్యాంగుడు గుగులోత్ చందు (35) రెండేళ్ల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. మూడు నెలల కిందట ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చాడు. వారం రోజుల నుంచి సమస్య మళ్లీ రావడంతో మనస్తాపం చెంది కలుపుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చందును కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, పాప, బాబు ఉన్నారు. చందు తండ్రి సామ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో గురువారం గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను శుక్రవారం టౌన్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.